సాక్షి
నారాయణపేట

శుక్రవారం, 5, సెప్టెంబర్, 2025



బ్యాడ్మింటన్ పోటీలు

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ గురువారం ప్రారంభమైంది.

-8లో ▸



కొనసాగుతున్న వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద గురువారం నిలకడగా కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /20.9

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం



నారాయణపేట టౌన్: లింగ వివక్షత లేని సమాజాన్ని నిర్మిద్దామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా సంక్షేమాధికారి రాంజేంద్రగౌడ్ అన్నారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఆదర్శ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో లింగ సమానత్వం, వివక్ష వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అందరికీ సమానమైనా హక్కులు భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు యాదయ్య బాలల హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ అసోసియేట్ నరేష్ అధ్యాపకులు శ్రీకాంత్, రమణ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ నర్సిములు, జెండర్ స్పెషలిస్ట్ అనిత, భారతి, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని పీడీ శంకర్ నాయక్ సూచించారు. మండలంలోని భూనీడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను గురువారం ఎంపీడీఓ కృష్ణారావ్‌తో కలిసి పరిశీలించారు. గ్రామానికి మొదటి విడతలో 43 ఇళ్లు మంజూరు కాగా 31 మంది లబ్ధిదారులు నిర్మాణాలను ప్రారంభించారు. ఇందులో 8 మందికి మొదటి విడత బిల్లును వ్యక్తిగత ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, కాంక్రీటు, స్టీల్ అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శాంత కుమార్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

అవినీతిని నిగ్గుతేల్చేందుకే సీబీఐ విచారణ: మంత్రి



స్టేషన్ మహబూబ్‌నగర్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన ప్రజాధనం దుర్వినియోగం, అవినీతిని నిగ్గుతేల్చేందుకే సీబీఐ విచారణ కోరినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందమని, చేతగాకనే కాళేశ్వరంను సీబీఐ విచారణకు ఇచ్చారని ఎంపీ డీకే అరుణ అనడం అర్థరహితమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్‌తో సమగ్ర విచారణ, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక, విజిలెన్స్ కమిషన్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టిన తర్వాత అందరి సమ్మతితో సీబీఐకు అప్పగించినట్లు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీల బంధం ఎలాంటిదో పార్లమెంట్ ఎన్నికల్లో చూశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నూటికి నూరుశాతం కాళేశ్వరంలో జరిగిన అవినీతిని కూకటివేళ్లతో బయటకు తీస్తుందన్నారు.

దరఖాస్తు చేసుకో.. అవార్డు పట్టుకో



గతేడాది ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు (ఫైల్)

అర్జీ పెట్టుకున్నవారందరూ ఉత్తమ ఉపాధ్యాయులే

- ప్రతి సంవత్సరం జిల్లా విద్యాశాఖ వింత పోకడ
- సర్వేపల్లి జయంతిని పురస్కరించుకొని టీచర్లకు అవార్డులు
- ఈ ఏడాది 47 దరఖాస్తులు

నారాయణపేట రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవానికి విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే వినూత్న బోధన, విధుల్లో అంకితభావం, విద్యార్థుల సంఖ్య పెంచడం, హరితహారం, డ్రాపౌట్స్ పిల్లలు స్కూల్‌కు తీసుకుని రావడం, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన ఉపాధ్యాయులకు అవార్డులను అందిస్తోంది. అవార్డులకు ఎంపిక ప్రక్రియ మాత్రం సంబంధిత టీచర్ ఆయా లక్షణాలు తనకు ఉన్నాయంటూ తెలుపుతూ దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ మీద ఉంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 47 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేస్తున్నారు.

బహిరంగ నోటిఫికేషన్ లేకుండానే..

ఆలస్యంగా నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు ఈ నెల 3 వరకు దరఖాస్తు చేసుకోవాలని గడువు విధించగా చాలా మంది టీచర్లు ఆసక్తి చూయించలేదు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు టీచర్లపై ఒత్తిడి పెట్టి పోటాపోటీగా నామమాత్రపు ఫొటోలు, కార్యక్రమ వివరాలతో కూడిన ఫైళ్లతో అప్‌లై చేయించారు. డీఐఈఓ, ఒక ఎంఈఓ, ఒక జీహెచ్‌ఎంతో కూడిన కమిటీ మార్కులు వేసినా చివరి వరకు జాబితాను బయట పెట్టకుండా విద్యాశాఖ అధికారులు తాత్సారం చేశారు. వాస్తవంగా క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే కాగితాలనే ప్రామాణికంగా తీసుకుని దరఖాస్తు చేసుకున్న అందరిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఎక్కడ కూడా కనీసం పత్రిక ప్రకటన సైతం ఇవ్వకుండా లోపలలోపల ప్రక్రియ చేయడం విమర్శలకు తావిస్తోంది.

ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం..

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30గంటలకు స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరు కానున్నారు.

ఎంపికపై విమర్శలు

ఉత్తమ ఉపాధ్యాయులుగా విద్యాశాఖ ఎంపిక చేసిన వారిలో చాలా మంది పాఠశాలలకు ఆలస్యంగా రావడం, తరగతి గదిలో నిద్రపోయేవారు, పిల్లలను గాలికి వదిలి స్కూల్ బయట ఇతర పనులు చేసేవారు, పనిచేస్తున్న చోట తోటి ఉపాధ్యాయులతో సక్యతగా లేకుండా పిల్లల ముందే గొడవలు పడ్డవారు సైతం కొందరు ఉండటం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. రెండేళ్లుగా ఈ తంతును పరిశీలిస్తే 2023లో 53మంది, 2024లో 44మంది దరఖాస్తు చేసుకోగా అందరికీ ఇచ్చారు. అదే పరంపర కొనసాగిస్తూ ఈ ఏడాది సైతం నామమాత్రంగా కార్యక్రమం పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ పని చేసింది తప్పా.. నిజమైన టీచర్లకు గౌరవించాలనే ఉద్దేశంతో ముందుకు పోలేదని పలువురు ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు.

ఈ ఏడాది 47 దరఖాస్తులు..

ఈ విద్యా సంవత్సరంలో నిర్వహిస్తున్న టీచర్స్ డే కార్యక్రమానికి ఉత్తమ ఉపాధ్యాయులుగా 47మందిని ఎంపిక చేశారు. గతంలో నేరుగా డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు ఇచ్చేవారు. కానీ ఈ సారి మండలాల పరిధిలోనే ఎంఈఓ వాటిని స్వీకరించి డీఈఓ కార్యాలయానికి పంపించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన త్రిమెన్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి అందరిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. ఆ జాబితాను కలెక్టర్ పరిశీలను పంపించగా గురువారం వివరాలు వెల్లడించారు.

ఎంఈఓల ద్వారా తీసుకున్నాం..



ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు సంబంధించి టీచర్లు స్వయంగా దరఖాస్తు చేసుకోవాలి. దీంతో జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఉత్సాహం చూయించడం లేదు. దీంతో అర్జీ పెట్టుకున్న వారందరికీ అవార్డులు ఇస్తున్నాం. గతంలో నేరుగా డీఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేవారు. ఈ సారి ఎంఈఓలు పరిశీలించి వాటిని డీఈఓ కార్యాలయానికి పంపించారు. కలెక్టర్ ఆమోదం వచ్చిన వెంటనే లిస్ట్ ప్రకటిస్తాం.

– గోవిందరాజు, డీఈఓ

‘వినూత్న’ బోధకుడికి పట్టం

- ఎస్‌జీటీ విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డు
- ఉత్తమ ఉపాధ్యాయుడిగా కుందేటి నర్సింహ



కుందేటి నర్సింహ

నారాయణపేట రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 5 న ప్రభుత్వం తరపున విద్యాశాఖ ఏటా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులు ఇస్తుంది. ఈ క్రమంలో జిల్లా ఏర్పాటు తర్వాత ఆరు సార్లు ఈ ఎంపికలు జరగగా.. 2019, 2021, 2023లో పలువురు టీచర్లు దరఖాస్తు చేసుకోగా ఎవరూ ఎంపిక కాలేదు. అయితే 2020లో తొలిసారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరుగురు ఎంపిక కాగా.. వారిలో ముగ్గురు నారాయణపేట టీచర్లు కావడం ప్రత్యేకం. 2022లో ఒక మహిళ ఉపాధ్యాయురాలికి అవార్డు వరించగా.. ఇప్పుడు ఉపాధ్యాయుడు నర్సింహ ఎంపికయ్యారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా గగ్గలపల్లికి చెందిన కుందేటి నర్సింహ 2008 డీఎస్సీలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికై వెల్దండ మండలం గోకారం ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. 2015లో జరిగిన బదిలీల్లో నారాయణపేట జిల్లా కోస్గి మండలం బోలవానిపల్లి ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. అక్కడే తొమ్మిదేళ్ల పాటు విధులు నిర్వహించి గ్రామస్తుల మన్ననలు పొందారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనంతో పాటు అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదులను కాంట్రాక్టర్‌తో మాట్లాడి సొంతంగా రూ.2లక్షలు ఖర్చు పెట్టి బాగు చేయించారు. తాగునీరు, టాయిలెట్స్ ఏర్పాటు చేయడంతో గోడలకు చక్కటి రంగులతో బొమ్మలు వేయించారు. ఏడాదిలోపే ఆ గ్రామం నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు స్థానికి ప్రభుత్వ పాఠశాలకు వచ్చారు. 20 మంది నుంచి 90 మందికి ఎన్‌రోల్‌మెంట్ పెంచారు. ఆవరణలో 50 మొక్కలను నాటి వాటిని సంరక్షించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనానికి కూరగాయలు, ఆకుకూరలను పండించేవారు. బోధన విషయంలో ఆయన తీరు అందరు టీచర్ల కంటే భిన్నంగా ఉంటుంది. పాఠ్యాంశాలను కథలు, నాటికలు, ఆటపాటలతో ఏకపాత్రాభినయం ద్వారా బోధన చేస్తారు. రెండుసార్లు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇక్కడి చిన్నారులు ప్రదర్శనలు ఇచ్చారు. 2024 జూన్‌లో బోలవానిపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయ్యారు. అయితే రిలీవ్ చేయరాదని సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరకు వెళ్లి గ్రామస్తులు వినతి పత్రం అందించడంతో ఆరు నెలలు పాత పాఠశాలలోనే విధులు నిర్వహించారు. వారం రోజుల క్రితం కున్సి ప్రాథమిక పాఠశాలకు పీఎస్ హెచ్ఎంగా పదోన్నతిపై వచ్చారు. ఆయనను కలెక్టర్ సిక్తాపట్నాయక్, డీఈఓ ఎండీ గోవిందరాజు, పీఆర్టీయూ, తపస్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదగిర్ జనార్దన్ రెడ్డి, శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహ, రెడ్డప్ప అభినందించారు.

బాధ్యత పెరిగింది

సాధారణంగా టీచర్‌గా విధులు నిర్వహించే సమయంలో పాఠాలు బోధించడంతో పని అయిపోతుంది. ప్రత్యేకమైన గుర్తింపు లభించినపుడు మరింత బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందడం ఆనందంగా ఉన్నా.. ఇక నుంచి అందుకు తగ్గట్లుగా వ్యవహరిస్తూ పిల్లలు, పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తా. పీఎస్ హెచ్ఎంగా పదోన్నతి పొందడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలతో పాటు మరిన్ని వినూత్న పద్ధతులతో బోధన కొనసాగిస్తాను. ఎంపికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు.

– కుందేటి నర్సింహ, పీఎస్ హెచ్ఎం

యూరియా ఇవ్వరు.. గోస తీర్చరు!



తీలేర్‌లో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



ధన్వాడలో క్యూ లైన్‌లో నిల్చున్న రైతులు



అంబులెన్స్‌లో ఆస్పత్రికి వెళ్తున్న వృద్ధులు

మరికల్/ధన్వాడ: మండలంలోని తీలేర్ సింగిల్ విండో సొసైటీ వద్దకు గురువారం తెల్లవారుజాము 5 గంటల నుంచి రైతులు బారులు తీరారు. 900 బస్తాల యూరియా రావడంతో అంతవరకే టోకన్లు ఇచ్చి బంద్ చేయడంతో అక్కడే ఉన్నా వందలాంది మంది రైతులకు ఆగ్రహంతో రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ రాము రైతులతో మాట్లాడడంతో రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం సీఐ, ఎస్ఐ రైతుల ఆధార్‌కార్డులు పరిశీలించి ఈ నెల 6న పంపిణీ చేసే యూరియా కోసం రైతుల బొటన వేలిపై ఇంకు అంటించి టోకన్లు అందజేశారు.

స్పృహతప్పి పడిపోయిన వృద్ధులు

తీలేర్ సొసైటీ వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడిన వృద్ధులు మణెమ్మ, కుర్మన్న స్పృహ తప్పి కింద పడిపోయారు. గమనించిన తోటి రైతులు వారిరి పక్కకు కూర్చొబెట్టి నీళ్లు తాగించారు. అనంతరం పోలీసులు వారిని 108 అంబులెన్స్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధులను పరామర్శించారు.

ఆరోపణలు తిప్పికొట్టండి

యూరియా దొరకని రైతులకు టోకన్లు జారీ చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్‌రెడ్డి పోలీసులకు సూచించారు. గురువారం తీలేర్ సొసైటీ వద్దకు వచ్చిన ఎమ్మెల్యే యూరియా పంపిణీపై సీఐ రాజేందర్‌రెడ్డితో ఆరా తీశారు. ప్రతిపక్షాలు యూరియా కొరతపై అపోహలు సృష్టిస్తున్నారని, ఈ విషయంలో పోలీసులు శాంతియుత వాతవారణంలో యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు.

■ ధన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం వద్ద గురువారం తెల్లవారు జామున 5 గంటల నుంచే రైతులు బారులు తీరారు. కేవలం 300 సంచుల యూరియా రావడంతో.. ఒక్కో రైతుకు రెండు నుంచి మూడు బ్యాగులు మాత్రమే అందజేస్తున్నారు. తిండి తిప్పలు లేకుండా ఉదయం నుంచి లైన్‌లో నిల్చున్న రైతులకు మాజీ ఎంపీటీసీ గొని శ్రీనివాసులు పండ్లు, వాటర్ పాకెట్లు పంపిణీ చేశారు.

ఆడపిల్లలు చదివితే సమాజానికి మేలు



గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

మక్తల్: ఆడపిల్లలు చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం మండలంలోని సగం బండ శివారులో ఉన్న కేజీబీవీ, ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో నిర్వహణ రికార్డులు, స్టాక్ రూం, వంటగది మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన కూరగాయలు వాడాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. భోజనాన్ని ప్రతి రోజు పరిశీలించిన తర్వాతే విద్యార్థినులకు వడ్డించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని, చదువులో వెనకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం కల్పించిన వసతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, ప్రిన్సిపాల్ రాధిక, చంద్రకళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నియంత్రణతోనే అధిక దిగుబడి

కోస్గి రూరల్: పంటలకు సోకే తెగుళ్లను ఎప్పటికప్పుడు నియంత్రిస్తేనే అధిక దిగుబడి సాధించవచ్చని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు పద్మశ్రీ, దివ్యలు అన్నారు. గురువారం మండలంలోని చంద్రవంచ, ముక్తిపాడ్, కోస్గిలో వరి, పత్తి, కంది, కూరగాయల పంటలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కంది పంటలో తెగుళ్లు సోకిన మొక్కలను కాల్చి, మందులు పిచికారీ చేయాలని, పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో ఆకుముడత పురుగు, కాండం తొలుచు పురుగు నివారణకు మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పాలమూరు జిల్లా సమన్వయ కర్త డాక్టర్ అర్చన, డాక్టర్ కల్యాణి, మండల వ్యవసాయాధికారి రామకృష్ణ, ఏఈఓ అజయ్, వినోద్ ఉన్నారు.

నిమజ్జనానికి ముస్తాబు..

- శోభాయాత్రలో అలంకరణలే ప్రత్యేకం
- నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ
- నేటి రాత్రి నుంచి గణనాథుల తరలింపు
- రేపు సాయంత్రం తర్వాత విగ్రహాల జలప్రవేశం



సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్



అలంకరణకు సిద్ధం చేస్తున్న చిత్రకారుడు



కోస్గిలో నిమజ్జనానికి తరలిన మున్నూరువీధి గణనాథుడు

నారాయణపేట రూరల్: చేనేత, బంగారానికే కాకుండా వినాయక ఉత్సవాల నిర్వహణలోనూ నారాయణపేటకు రాష్ట్రంలోనే ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఎక్కడైనా విశిష్ట రూపాల్లో గణనాథులను ప్రతిష్ఠించడం.. మండపాల్లో వివిధ రకాలైన అలంకరణలు చేయడం చూస్తుంటాం. కానీ పేటలో మాత్రం అందుకు భిన్నంగా శోభాయాత్రలో విద్యుత్ దీపాలతో, ఇతిహాసిక సన్నివేశాలు, కదులుతున్న బొమ్మలతో కూడిన అలంకరణలు చేస్తుంటారు. ఆగస్టు 27న చవితి గడియల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు నవరాత్రులు ప్రత్యేక పూజలు చేసి, అనంత చతుర్థశి గడియల్లో గంగ చెంతకు చేరనున్నాడు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, నైవేద్యాలను సమర్పించి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం చేపట్టారు. నిమజ్జన శోభాయాత్రను తిలకించడానికి చుట్టు పక్కల జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

పటిష్ట బందోబస్తు

ఉమ్మడి పాలమూర్ జిల్లాలోనే ఎంతో ప్రఖ్యాతి చెందిన నారాయణపేట పట్టణ గణేష్ నిమజ్జనానికి పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో పాటు రెండు స్పెషల్ బెటాలియన్ల సిబ్బందిని రప్పించారు. అదనంగా ఒక ఎస్పీతో పాటు ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు, 15 మంది ఎస్ఐలతో పాటు 200 మందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అన్ని ప్రార్థనా మందిరాలు, ముఖ్య కూడళ్లు, గణేష్ మార్గ్‌లో పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ సిబ్బంది మోహరించారు. అదేవిధంగా అన్ని మండపాలతో పాటు ఊరేగింపు జరిగే ప్రాంతాలు, నిమజ్జనం చేసే కొండారెడ్డిపల్లి చెరువు, బారంబావి తదితర ప్రాంతాల్లో బాంబ్‌స్కాడ్ బృందం తనిఖీలు చేపట్టింది.

సీసీ కెమెరాలు.. జియో ట్యాగింగ్‌లు

గతంలో ఎన్నడూ లేని విధంగా గణేష్ ఉత్సవాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. పట్టణంలో 141 వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించగా.. వీటన్నింటికి జియో ట్యాగింగ్ చేశారు. అదే విధంగా అన్ని కూడళ్లు, గణేష్ నిమజ్జన శోభాయాత్ర జరిగే రోడ్లపై సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. దీని కోసం ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అధికారులు, ఐటీ కోర్ సిబ్బందితో 24 గంటల పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి మండపాల నుంచి బయటకు వచ్చే గణనాథులను పట్టణ ప్రధాన రహదారి మీదుగా శనివారం సాయంత్రం వరకు కొండారెడ్డిపల్లి చెరువుకు నిమజ్జనానికి తరలిస్తారు. అక్కడ అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేశారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసు సిబ్బందితో పాటు వైద్య ఆరోగ్య శాఖల వారికి విధులు కేటాయించారు. ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ నాయకులు సైతం సహకారం అందిస్తున్నారు.

ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

నారాయణపేట టౌన్: వినాయకుడి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా కేంద్రంలోని స్థానిక పత్తి బజార్‌లో కర్ణ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాము మొదలుపెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేటట్లు చూడాలని, కష్టాలను తొలగించి ప్రజల జీవితాలలో సుఖ సంతోషాలను నింపాలని మహా గణపతిని మనస్ఫూర్తిగా కోరుకున్నానని తెలిపారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో శనివారం జరిగే గణేష్ శోభయాత్రను సంతోషంగా, శాంతియుతంగా నిర్వహించుకొని పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. తదనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జన వేడుకలు

కోస్గి: పట్టణంలోని పలు కాలనీల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుల నిమజ్జన వేడుకలు గురువారం రాత్రి వేడుకగా జరిగాయి. మున్నూర్‌వీధిలో 18 అడుగుల భారీ వినాయకుడిని ప్రతిష్ఠించగా.. పోటాపోటీగా లడ్డు వేలంలో విజయ గణపతి మండప ఉత్సవ సమితి బృందం రూ.13 లక్షలకు దక్కించుకున్నారు. అదేవిధంగా నర్సప్ప కట్ట, తెలుగు వీధి, కమ్మరి వీధి వినాయక నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

- పూర్తి వివరాలు 9లో..

క్లుప్తంగా

గల్లంతైన దంపతుల మృతదేహాలు లభ్యం




తాటికుంట రిజర్వాయర్‌లో లభ్యమైన రాముడు, సంధ్య మృతదేహాలు

మల్దకల్: రిజర్వాయర్‌లో పుట్టీ సాయంతో చేపలు పట్టేందుకు వెళ్లిన దంపతులు గల్లంతు కాగా.. గురువారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. పూర్తి వివరాలిలా.. మల్దకల్ మండలంలోని తాటికుంట రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రం దంపతులు బోయ దుబ్బోనిబాయి రాముడు, సంధ్య చేపలవేటకు ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో వారి ఆచూకీ కోసం రెండు రోజుల పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు గురువారం తెల్లవారుజామున దంపతుల మృతదేహాలు నీటిలో తేలుతూ కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం అందించారు. అనంతరం మల్దకల్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

నవాబుపేట: పంట పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి మహిళ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని జంగమయ్యపల్లికి చెందిన కంచె కిష్టమ్మ(40) గ్రామ సమీపంలో కుమ్మరి రాములు వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు వేసిన విద్యుత్ కంచె వల్ల షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు కుటుంబ సభ్యులు సమాచారం అందించగా కిష్టమ్మ కుమారుడు నరేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

తండ్రిపై కుమారుడి దాడి: కారు డిక్కీలో తరలింపు

కల్వకుర్తిటౌన్: వ్యవసాయ పొలం వద్ద ఉన్న కన్నతండ్రిపై కర్రతో దాడిచేసి అక్కడి నుంచి కారులో డిక్కీలో తరలించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లో వెళ్తే.. పట్టణంలోని వాసవీనగర్‌లో నివాసముంటున్న రైతు బాలయ్య(70) పొలం వద్ద ఉండగా.. బుధవారం సాయంత్రం కుమారుడు బీరయ్య తండ్రిపై కర్రతో దాడిచేసి కారు డిక్కీలో వేసుకొని పరారయ్యాడు. రాత్రివరకు బాలయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా.. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. దీంతో గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కుమారుడు బీరయ్యనే దాడి చేసి కారులో తీసుకెళ్లినట్లు గుర్తించి అతనికోసం గాలిస్తున్నారు. 24గంటలు గడిచినా వృద్ధుడి ఆచూకీ లభించకపోవడం, దాడికి పాల్పడిన కుమారుడు పరారీలో ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై కల్వకుర్తి సీఐ నాగార్జునను వివరణ కోరగా.. గాయపడ్డ వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించాడా? లేదా ఏమైనా చేశాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగదీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కుటుంబసభ్యులు

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆయనది ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నైజం: మంత్రి వాకిటి శ్రీహరి
- పాలమూరులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పదేళ్లపాటు సుదీర్ఘకాలంగా పని చేశారని, పార్టీ యంత్రాంగాన్ని నడపాలంటే ఆయన్ను చూసి నేర్చుకోవాలని, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్టులో గురువారం మాజీ ఎమ్మెల్సీ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ పార్టీ పరమైన అంశాల్లో, ఇతర సమస్యల్లో ఎవరి మనసు నొప్పించక ప్రజాస్వామికబద్ధంగా వ్యవహరించేవారని అన్నారు. ఆనాడు పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో జిల్లా నుంచి ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగారని అన్నారు. రాజకీయాలకు సరైన వ్యక్తిగా ఆయన జీవన ప్రయాణం కొనసాగిందన్నారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఆయననే చూసే నేర్చుకోవడం జరిగిందన్నారు. ఎంపీ డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి ఆదర్శప్రాయుడని, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డితో తనకు ఎంతో ఆత్మీయత అనుబంధం ఉందన్నారు. మొదట్లో నాకు రాజకీయాలు వద్దని చెప్పారని, తర్వాత నాకున్న ఆసక్తితో రాజకీయాల్లో ఎంతో ప్రోత్సహించారని గుర్తుచేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతురావు మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి నిరుపేదలకు సహాయం చేయడంలో ముందుండేవారని అన్నారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, యశస్వినిరెడ్డి, కార్పొరేషన్‌ల చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, కోదండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భానుప్రకాశ్, యాదవరెడ్డి తదితరులు జగదీశ్వర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ నందిని, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ. వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, భగవంతురావు, సీజే బెనహర్, ప్రశాంత్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌ల్లో తలపడుతున్న క్రీడాకారులు

క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు పూర్తి
- నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు
- ప్రేక్షకులతో కిటకిటలాడిన ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–13) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి 225 క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు గురువారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరిచిన వారు శుక్రవారం నుంచి జరిగే మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం...

రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నాయని మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను వారు పరిశీలించారు. నాలుగు సింథటిక్ కోర్టుల్లో సింగిల్, డబుల్స్ పోటీలు జరుగుతాయని, ఈ నెల 7న చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకుడు సుధాకర్, రెఫరీ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్, విజయ్‌రెడ్డి, ఎంపీ.ప్రవీణ్, సభ్యులు శశాంక్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేయాలి

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



హాకా రైతుసేవా కేంద్రం వద్ద పంపిణీ గురించి చైర్మన్ కోదండరెడ్డికి వివరిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని బోయపల్లిరోడ్‌లో గల హాకా రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకరోజు ముందుగానే టోకన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేస్తున్నామని అధికారులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అందరికీ టోకెన్లు వచ్చేలా చూడాలని, మహిళలకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారికి చైర్మన్ ఫోన్ చేసి యూరియా పంపిణీ, భూ భారతి చట్టం అమలు తీరుపై ఆరా తీశారు. రైతులకు ఒకే కేంద్రానికి కేంద్రానికి రాకుండా ఎక్కడి వారికి అక్కడే పంపిణీ జరిగేలా చూడాలని కలెక్టర్, డీఏఓలకు సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్న విషయాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిగువ జూరాలలో సోలార్ కేంద్రం

జెన్‌కో సీఎండీ డా. హరీశ్



దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెన్‌కో సీఎండీ డా. హరీశ్

ఆత్మకూర్: రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల వద్ద అవకాశం ఉన్నచోట సోలార్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని టీఎస్ జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. హరీశ్ తెలిపారు. గురువారం జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలను సందర్శించారు. దిగువ జూరాల వద్ద 100 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని.. 20 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే కొత్తగూడెంలో కూడా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది దిగువ జూరాలలో రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టి లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమన్నారు. ఎగువన కూడా లక్ష్యానికి చేరువలో ఉన్నారని చెప్పారు. బదిలీలు చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగులు సీఎండీని అభ్యర్థించగా త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డైరెక్టర్ బాలరాజు, ఎస్‌ఈలు శ్రీధర్, సురేష్, సిబ్బంది ఉన్నారు.

డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలి

కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్



చిన్నదర్పల్లి బీట్ పరిధిలో అటవీభూమి, చెట్లను పరిశీలిస్తున్న డీజీ చంద్రశేఖర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణలో ఫారెస్ట్ డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న అటవీ భూమి, చెట్లను ఆయన పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నష్టానికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని డీఎఫ్‌ఓ సత్యనారాయణకు సూచించారు. విస్తరణలో పోతున్న అటవీ భూమికి బదులుగా మరోచోట ఇవ్వడం, చెట్లకు బదులుగా మరోచోట నాటడం వంటి పనుల్లో ఎలాంటి జాప్యం జరగరాదని సూచించారు. అనంతరం మహబూబ్‌నగర్ సమీపంలోని దొడ్డలోనిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధి ప్లాంటేషన్, మయూరీ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో ఏర్పాట్లు, మొక్కలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి అబ్దుల్‌హాయ్, జాతీయ రహదారి ఈఈ తదితరులు పాల్గొన్నారు.



మయూరీ పార్క్‌ను పరిశీలిస్తున్న అటవీ డీజీ

మైసమ్మ ఆలయానికి అటవీ భూమి

ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి



సమస్య పరిష్కారంపై వివరాలు ప్రకటిస్తున్న ఆలయ చైర్మన్, సభ్యులు

నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధిచెందిన పర్వాతాపూర్ మైసమ్మ ఆలయానికి అటవీ భూమి కోసం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ద్వారా ప్రత్యేక ప్రతిపాదన చేసినట్లు మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మైసమ్మ ఆలయానికి అదనంగా 4.0889 హెక్టార్ల (దాదాపు పది ఎకరాలు)అటవీ భూమి కోసం ప్రత్యేక వినతిని జడ్చర్ల ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ అటవీ భూమిలో సంబంధిత అధికారులతో సర్వే చేయించి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, కేంద్ర కార్యాలయం తుది అనుమతి రావాల్సి ఉందని.. దీనికి త్వరలోనే అనుమతులు తీసుకొచ్చేలా చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

ఆలయ సిబ్బందికి పెరిగిన వేతనాలు

కొన్నేళ్లుగా ఆలయంలో వివిధ రకాల పనులు చేస్తున్న వారికి కనీస వేతనాలు పనికి తగ్గట్లుగా అందేవి కావు. దీంతో వారు చాలా ఏళ్లుగా కనీస వేతనం కోసం జడ్చర్ల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించడంతో తాజాగా 6 కూలీలకు కనీస వేతనం అందించే జీఓ బుధవారం వచ్చిందని మైసమ్మ ఆలయ చైర్మన్ తెలిపారు. దీంతో గతంలో నెలకు రూ.7500 అందించే వేతనాన్ని రూ.12వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే వంశపారంపర్యంగా ఆలయంలో పనులు చేసే మరో వ్యక్తికి సంబంధించి పర్మినెంట్ వేతనం మంజూరు చేస్తూ ప్రభుత్వం గజిట్ ఇచ్చిందని తెలిపారు. దీంతో ఆలయంలో ఉన్న పెండింగ్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చైర్మన్‌తోపాటు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

8 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్/రాజోళి/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద నిలకడగా కొనసాగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 1,02,950 క్యూసెక్కులు ఉండగా.. గురువారం రాత్రి 8.30 ప్రాంతంలో 92 వేల క్యూసెక్కుల తగ్గినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి 55,928 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తికి 40,324, ఆవిరి రూపంలో 70, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 670, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.651 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

586.515 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో గురువారం ఉత్పత్తి వేగవంతంగా కొనసాగిందని ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 279.387 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 307.128 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని, ఇప్పటి వరకు 586.515 మి.యూ. విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 73 వేల క్యూసెక్కుల వరద రాగా.. 17 గేట్లను మీటర్ మేర తెరిచి 70,312 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు. అలాగే 2,626 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు సరఫరా చేసినట్లు తెలిపారు.

శ్రీశైలం మూడు గేట్లు ఎత్తి..

ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం పెరగడంతో గురువారం శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదిలారు. జూరాల స్పిల్‌వే నుంచి 55,928 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 40,324 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,872 క్యూసెక్కుల వరద జలాశయం చేరుతుందని.. జలాశయం స్పిల్‌వే ద్వారా 82,710 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,012 క్యూసెక్కులు దిగువనున్న నాగార్జునసాగర్‌కు వదిలినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 883.9 అడుగుల నీటి మట్టం.. 209.1579 టీఎంసీల నీటి నిల్వ ఉందని చెప్పారు. భూగర్భ కేంద్రంలో 17.179 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.608 మి.యూ., విద్యుదుత్పత్తి చేశారు.

మహిళ మెడలో మంగళసూత్రం చోరీ



మహిళ వెనకాల వస్తున్న వ్యక్తి



బైక్‌పై పరారవుతున్న దొంగలు

బైక్‌పై పరారైన దొంగలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఫ్రీజన్ రోడ్డులో గురువారం గోదా నాగలక్ష్మి అనే మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడు (బంగారుగొలుసు) చోరీ చేశారు. స్థానికంగా నివాసముంటున్న నాగలక్ష్మి రేషన్ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఫాలో అవుతూ వచ్చాడు. నిర్మానుష ప్రాంతంలో మెడలోని గొలుసు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. అనంతరం ఎన్‌ఎస్125 బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో దుండగుడితో కలసి పరారైనట్లు పేర్కొన్నారు. బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మల్లేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని సీసీ కెమెరాల రికార్డులు పరిశీలించారు. చోరీ అయిన గొలుసు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జాలం బాలమ్మ భర్త నర్సింహతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లి రాత్రికి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు విరగ్గొట్టి ఉండటంతో పాటు బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించారు. గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు, రూ.11 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ జావిద్ (35), బుచ్చయ్య ఇద్దరు బుధవారం చేపల వేటకు వెళ్లారు. కాగా జావిద్ చేపల పట్టుకునే క్రమంలో చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బుచ్చయ్య గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ విక్రమ్ గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి మరో సారి గాలింపుచర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా జావిద్‌కు భార్య అన్వర్‌తో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు



నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

ఒకరి దుర్మరణం, ఇద్దరికి గాయాలు



రోహిత్ మృతదేహం

జడ్చర్ల: పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న కంటెయినర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయాల పాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపునకు వెళ్తున్న కంటెయినర్‌ను బ్రిడ్జిపై వెనుక నుంచి అతి వేగంగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న రోహిత్ (30) అక్కడికక్కడే మృత్యువాత పడగా.. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారందరూ హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి కలకలం

- ఆహారం పారబోత.. మళ్లీ వండి విద్యార్థులకు అందజేత
- ఉప్పేరు ఉన్నత పాఠశాలలో ఘటన.. ఎంఈఓ విచారణ



వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో బల్లి పడిన ఘటన మండలంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ధరూరు మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం విద్యార్థులకు వంట ఏజెన్సీ వారు రోజులాగే భోజనం సిద్ధంచేసి ప్లేట్లలో వడ్డించారు. అనంతరం విద్యార్థులు చెట్ల కింద కూర్చొని భోజనం చేస్తుండగా ఓ విద్యార్థి ప్లేట్‌లో బల్లి కనిపించింది. దీంతో వెంటనే విషయాన్ని ఇతర విద్యార్థులకు తెలియజేయడంతో ప్లేట్లలో ఉన్న భోజనాన్ని పారబోశారు. అయితే, చెట్ల కింద కూర్చుని తింటుండగా పైనుంచి బల్లి పడి ఉండవచ్చునని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ వారు చెబుతుండగా.. విద్యార్థులు కూరలోనే వచ్చిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు వైరల్ అయ్యింది. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఎంఈఓ రవీంద్రబాబు గురువారం పాఠశాలకు చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. పిల్లలు చెట్ల కింద కూర్చుని తింటుండగానే చెట్టు పైనుంచి బల్లి పడి ఇలా జరిగిందని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మహిళలు వివరించారు. ఎవరికీ ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తలేదని తెలిపినట్లు ఎంఈఓ తెలిపారు. ఇదిలా ఉండగా.. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. వంట ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని, సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రామాంజనేయులు, మనోజ్ కుమార్, గోపాల్, విజయ్ తదితరులు ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు.